నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
బుధవారం | జూన్ 26, 2024 | www.navatelangana.com

గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పిస్తాం

ఆసిఫాబాద్ : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యం కల్పించేందుకు బస్ సర్వీస్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు డీఎం విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఆసిఫాబాద్ నుండి కన్నర్గాం మీదుగా నందుపాకు బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. ప్రజలు ప్రయివేటు వాహనాలలో ప్రయాణించకుండా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. ఆర్టీసీ బస్సులను ఆదరిస్తేనే గ్రామీణ ప్రాంతాల రూట్‌లకు బస్సును నడపడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలకు, కళాశాలలకు వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని సమయానుకూలంగా బస్సులు నడుపుతామన్నారు. అంతకుముందు వివిధ గ్రామాల ప్రజలు, విద్యార్థులు బస్ ఏర్పాటు చేయాలని కోరడంతో స్పందించిన డీఎం బస్సు ఏర్పాటు చేసి ప్రయాణికులతో కలిసి నందుప వరకు ప్రయాణం చేశారు.



కుక్కల దాడిలో మూడు మేకలు మృతి

నవతెలంగాణ-తాంసి

మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో మూడు మేకలు మృతి చెందాయి. పాలోడి గ్రామానికి చెందిన నేరల్ల రవికి చెందిన మేకలను కాపరి మంగళవారం సమీప గుట్టపై మేత మేయడానికి తీసుకెళ్లాడు. మేత మేస్తున్న సమయంలో ఒక్కసారిగా మేకల మందపై కుక్కలు దాడి చేయడంతో ఆరు మేకలకు తీవ్ర గాయాలయ్యాయి. మూడు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మిగతా మూడు మేకలకు పశు వైద్యులు వైద్యం చేసి ప్రాణాలు కాపాడారు. చనిపోయిన మేకల విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని మేకల యజమాని తెలిపారు. ఇకనైనా గ్రామాల్లో కుక్కల బెడద నివారించాలని పలువురు గ్రామ పంచాయితీ అధికారులను కోరుతున్నారు.



సీసీఐ క్వార్టర్స్‌లో దొంగతనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని సీసీఐ క్వార్టర్‌లో సోమవారం రాత్రి దొంగలు పడి గ్యాస్ సిలిండర్, ఫ్రిజ్, ఫర్నీచర్ ఎత్తుకెళ్లారు. బాధితుడు నర్సింహస్వామి తెలిపిన వివరాల ప్రకారం...సీసీఐ యాజమాన్యం ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వని కారణంగా క్వార్టర్లో ఉంటున్నారు. ఇటీవల అధికారులు క్వార్టర్ ఖాళీ చేయాలని చెప్పారు. అయితే సామాన్లు ఇక్కడే వదిలి నెల క్రితం వేరే చోటుకు వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగిలి ఉంది. ఇంట్లోని గ్యాస్ సిలిండర్, ఫ్రిజ్, ఫర్నీచర్ ఇతర వంట సామాన్లు కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. అనంతరం బాధితుడు ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం జరిగినా జీఎం స్పందించలేదు

పట్టణంలోని సీసీఐ క్వార్టర్స్‌లోని ఓ ఇంట్లో దొంగతనం జరిగినా జీఎం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు. సోమవారం రాత్రి దొంగతనం జరుగగా ఈ విషయం తీసుకున్న దేవేందర్ మంగళవారం ఆ ఇంటిని సందర్శించారు. యజమాని నర్సింహాస్వామిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సహకార సంఘ సమావేశం



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని సహకార సంఘ భవనంలో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని చైర్మన్ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ చైర్మన్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండే విధంగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సీఈఓ శ్రీనివాస్‌ను ఆదేశించారు. సుంకిడి సూపర్ మార్కెట్, భరంపూర్‌లో కొత్తగా నిర్మిస్తున్న పెట్రోల్ పంప్ పని గురించి తెలుసుకొని సమావేశంలో చర్చించుకున్నారు. నాబార్డ్ ద్వారా రూ.6లక్షలు మంజూరు కానున్నాయని, వాటిని రైతులకు ఉపయోగపడే విధంగా గోదాం నిర్మిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ నల్ల పద్మాకర్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, డైరెక్టర్లు గంగారాం, శ్రీనివాస్‌రెడ్డి, ఆశమ్మ, జలంధర్, లింగారెడ్డి, లక్ష్మి, ప్రతాప్, మణిరాం, సుధాకర్ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలి



నవతెలంగాణ-బోథ్

మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని అడిషనల్ డీఆర్‌డీఓ కుటుంబరావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల దృష్ట్యా మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో గల వివిధ కార్యాలయాల ఆవరణతో పాటు రైతుల పంట పొలాల్లో, రోడ్డుకు ఎరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాలని సూచించారు. అదేవిధంగా ప్రతి గ్రామపంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి వాటిలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అలాగే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉపాధి హామీ సిబ్బంది ప్రతి ఒక్కరు బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జగ్దేవ్‌రావు, ఉపాధి హామీ టీఏలు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారమేదీ..?

- పెండింగ్‌లో ఉన్న సగం ఫిర్యాదులు
- అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించే ప్రజావాణికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి సమస్యల పరిష్కారం కోసం సమయాన్ని వెచ్చించి కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తారు. అయితే వివిధ శాఖల అధికారుల పట్టింపులేని తనంతో ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో సగానికి పైగా పెండింగ్‌లో ఉండడంతో ప్రజావాణిపై ప్రజల నమ్మకం సన్నగిల్లే పరిస్థితి తలెత్తుతోంది. ప్రస్తుత కలెక్టర్ నిర్వహించిన మొదటి ప్రజావాణిలోనే విషయాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజావాణి సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయేమో వేచి చూడాలి.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రతి సోమవారం ఎన్నో ఆశలతో కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదులు అందజేస్తారు. అధికారుల తీరుతో ప్రజావాణిపై ప్రజలకున్న విశ్వాసం పోతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో సాధారణ ఫిర్యాదులు మొత్తం 10110 రాగా వాటిని జిల్లా కలెక్టర్లు ఆయా శాఖలకు బదిలీ చేయగా మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో 5562 పెండింగ్‌లో ఉన్నాయి. రెవెన్యూకు సంబంధించిన ఫిర్యాదులు 6071 రాగా 1516 ఫిర్యాదులు వివిధ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి. ప్రజలు పరిష్కారం కోసం ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

పెండింగ్‌లో సగం ఫిర్యాదులు

జిల్లాలోని 15 మండలాలకు సంబంధించి కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదులు 10,000 ఉండగా దానిలో 5500 అంటే సగానికి పైగా పెండింగ్ లో ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యల కోసం కలెక్టరేట్‌కు వచ్చినప్పటికీ పరిస్థితి మారడం లేదని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల తీరుపై కలెక్టర్ ఆగ్రహం

ప్రజావాణిపై ప్రజల్లో ఎంతో విశ్వాసం ఉంటుంది. అయితే అదే స్థాయిలో జిల్లా అధికారులు కూడా స్పందిస్తే ఫిర్యాదుదారునికి కొంత చేయూత కలుగుతుంది. దీనికోసం జిల్లా అధికారులు తప్పనిసరిగా ప్రజావాణికి హాజరు కావాల్సి ఉంటుంది.

జిల్లాలో పెండింగ్ దరఖాస్తుల పరిస్థితి చూసిన ప్రస్తుత కలెక్టర్ వెంకటేష్ దోత్రే తన మొదటి ప్రజావాణిలోనే అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణికి హాజరు కాకుంటే అధికారులపై చర్యలు తీసుకోవడంతో పాటు షోకాజ్ నోటీస్ ఇస్తామని హెచ్చరించారు. కలెక్టర్ తన మార్కు పరిపాలన చూపాలని, ఫిర్యాదులు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. అధికారుల తీరు ఇప్పటికైనా మారి ప్రజా సమస్యలపై దృష్టి కేంద్రీకరిస్తారేమో చూడాలి.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ధర్నా

నవతెలంగాణ-నస్పూర్

బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను మార్చి 4 లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చారని, ఇది కార్మిక వర్గానికి చాలా ప్రమాదకరమని అన్నారు. ఈ దేశానికి లక్షల కోట్ల లాభాలను సమకూర్చి పెట్టే ప్రభుత్వ రంగ సంస్థలను ఆదాని, అంబానీలకు కట్టబెట్టడం కొరకు ఈ కార్మిక చట్టాలను మార్చారన్నారు. కార్మికులు బ్రిటిష్ ప్రభుత్వంపై కొట్లాడి అనేక త్యాగాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను దేశంలో ఉన్న పెట్టుబడిదారుల కోసం బీజేపీ ప్రభుత్వం మార్చిందని మండిపడ్డారు. రైల్వే, బ్యాంకింగ్, షెయిల్, గేయెల్ కోల్ ఇండియా, ఎల్‌ఐసి, నౌకాయానం తదితర ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఆదాని, అంబానిలకు కట్టబెట్టి కార్మికులు చట్టాల అమలు కొరకు, హక్కుల కోసం మాట్లాడకుండా చేయడం కోసం మాత్రమే బీజేపీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు. ఈ విధానాన్ని ఐఎఫ్‌టియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, తక్షణమే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేస్తున్నట్టు తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వాన్ని పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎండి. జాఫర్, జిల్లా నాయకులు మల్లన్న, సదానందం, సోమన్న, గణేష్, సాజిద్, అరుణ, శోభ, సునీత పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-తలమడుగు

రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయడానికి మంత్రి వర్గం ఆమోదించిన సందర్భంగా మంగళవారం సుంకిడి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల పక్షాన నిలబడి రెండు లక్షల రుణమాఫీ చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. లక్ష రూపాయలు రుణమాఫీ చేయలేని బీఆర్ఎస్ ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. రెండు లక్షల రుణమాఫీ వల్ల రైతుల కళ్లలో ఆనందం కనబడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కళ్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పిటిసి బాబన్న, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్‌రావు, గోక భూమారెడ్డి, ఎంపీటీసీలు రమేష్‌రెడ్డి, కమలాకర్, వెంకన్న యాదవ్, కో ఆప్షన్ మెంబర్ బాబుఖాన్, రావుల నారాయణ, సల్ల దేవన్న, రాములు, గణేష్, విలాస్ యాదవ్, రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచులు, మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

బోథ్ : రైతులకు ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంగళవారం బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ చేయడానికి నిర్ణయించిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు పాలించినా రుణమాఫీ చేయకపోవడంతో రైతులు చాలా నష్టపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, నాయకులు గడ్డల నారాయణ, మెరుగు భోజన్న, రాజేష్, ఉమేష్, విజయ భాస్కర్‌రెడ్డి, చెట్లపల్లి అనిల్, రాజు పాల్గొన్నారు.



తలమడుగు



బోథ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-లోకేశ్వరం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పంచగుడి - లోకేశ్వరం రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మోహన్‌రావ్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని పంచగుడి గ్రామానికి చెందిన కుమ్మరి సాయన్న(55) గ్యాస్ సిలిండర్ కొరకు ద్విచక్రవాహనంపై లోకేశ్వరం వెళ్తున్న క్రమంలో వాహనం అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న కల్వర్టుకు ఢీకొని కింద పడ్డాడు. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం అయింది. దీంతో ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. మృతుని కూతురు పోతుగంటి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.



గోడ కూలి కార్మికులకు గాయాలు

నవతెలంగాణ-మంచిర్యాల

కొన్ని రోజుల క్రితం మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఓ భవనం నిర్మాణం జరిగే క్రమంలో గోడ కూలి ముగ్గురు కార్మికులు చనిపోయిన ఘటన మరువకముందే మంగళవారం వెంకటేశ్వర థియేటర్ చౌరస్తాలో మరో భవన నిర్మాణం జరుగుతుండగా సెల్లార్ గోడ కూలడంతో నలుగురు కార్మికులు తీవ్ర గాయాలపాలయ్యారు. గాయపడ్డ కార్మికులను మంచిర్యాలలో గల ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డ వారిలో మంచిర్యాల, నస్పూర్‌కు చెందిన రాములు, మల్లయ్య, గంగారాం, నర్సయ్య ఉన్నారు. వరుసగా భవన నిర్మాణంలో జరుగుతున్న ప్రమాదాల దృష్ట్యా స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణ సమయంలో యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇష్టానుసారం బహుళ అంతస్తులకు అనుమతులు ఇస్తున్న అధికారుల తీరుపై మండిపడుతున్నారు. పట్టణంలో చాలా వరకు సెల్లార్, సెట్ బ్యాక్ లేని భవనాలు పెద్ద ఎత్తున నిర్మాణం జరుగుతున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా సంఘటన స్థలాన్ని పట్టణ సీఐ బన్సీలాల్ పరిశీలించారు.





ప్రజా సంక్షేమం దిశగా చర్యలు



నవతెలంగాణ-నస్పూర్

రాష్ట్ర సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధులు, ప్రజల సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు నిర్మల కాంతి వెస్లీ, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీల నిర్వహణ, పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ, ట్రాన్స్‌జెండర్ల ధ్రువపత్రాల జారీ, పిల్లల దత్తత, వయోవృద్ధుల పోషణ ఇతర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లకు పిల్లలకు విద్యాబోధనపై ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు అంగన్వాడీ కేంద్రాలలోని పిల్లల ఆరోగ్యం, ఎదుగుదలను పర్యవేక్షిస్తూ శామ్-మామ్ పరిధిలోకి వచ్చే పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సకాలంలో పోషకాహారం, అవసరమైన మందులను అందిస్తూ వారికి మామూలు పిల్లల స్థితికి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు ప్రభుత్వం అందించే బాలామృతం, పోషకారాన్ని సకాలంలో పంపిణీ చేస్తూ వారికి సమయానుసారంగా ఆరోగ్య పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. పిల్లలు లేని వారు పిల్లల దత్తతకు ఆసక్తి గల వారికి సరైన సూచనలు అందించి నిబంధనల మేరకు దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. గృహహింసకు గురైన మహిళలు, లైంగిక వేధింపులకు గురైన బాలికలు, యువతులకు సఖి కేంద్రం ద్వారా ఆశ్రయం కల్పిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టడంతో పాటు కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జిల్లాలో 4 ఐసిడిఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 895 అంగన్వాడీ కేంద్రాలు, 74 మినీ అంగన్వాడీ కేంద్రాల ద్వారా సేవలు అందించడం జరుగుతుందని, 7నెలల నుండి 3సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నెలకు 2.5 కేజీల బాలామృతంతో పాటు నెలకు 16 కోడిగుడ్లను అందించడం జరుగుతుందని తెలిపారు. బాల్యవివాహాల నిరోధానికి కళాజాతా, వివిధ ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా 2017 నుండి ఇప్పటి వరకు 106 బాల్యవివాహాలను నిలిపివేయడం జరిగిందని తెలిపారు. ట్రాన్స్‌జెండర్స్ కొరకు సఖి కేంద్రంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అర్హత గల వారికి గుర్తింపు కార్డులు జారీ చేయడం జరుగుతుందని, ఇప్పటి వరకు జిల్లాలో నలుగురు ట్రాన్స్‌జెండర్లకు ధవపత్రం, గుర్తింపు కార్డు జారీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్య, బాలల పరిరక్షణ సమితి అధికారి ఆనంద్, సిడిపిఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

28న వారసంత వేలం పాట

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే వారసంతను శుక్రవారం ఉదయం 10గంటలకు గ్రామపంచాయతీ కార్యాలయంలో వేలం వేయనున్నామని పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. జూలై 2024 నుండి మార్చి 2025 వరకు వేలం వేయడానికి వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేవారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయి ఉండరాదని, వేలానికి సరైన పాట రానియెడల వాయిదా వేస్తామన్నారు. వేలం దక్కించుకున్న వారు గ్రామపంచాయతీ ఇచ్చిన రేట్ల ప్రకారమే వసూలు చేయాలని, నియమ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | జూన్ 26, 2024 | www.navatelangana.com

రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన

నవతెలంగాణ-లోకేశ్వరం

మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు భరోసా, రైతుల అభిప్రాయాల సేకరణ, వాన



కాలం పంటల సాగుపై యాజమాన్య పద్ధతులను రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముధోల్ ఏడీఏ వీణ, ఏఓ గణేశ్, ఏఈఓ కుంట మౌనిక, ఉమేష్, భూమేష్, మౌనిక, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

నవతెలంగాణ-నార్నూర్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెచ్ఈఓ పి.రవీందర్ అన్నారు. మంగళవారం గాదిగూడ మండలంలోని షెడ్వాయి గ్రామంలో ఇంటింటా తిరుగుతూ డ్రైడే నిర్వహించారు. వర్షాకాలం వ్యాపిస్తున్న తరుణంలో ఇంట్లో ఉన్న కులర్, టైర్లులో ఉన్న నీటిని పారబోయించారు. నీటిని నిల్వ ఉండటం వల్ల దోమలు వ్యాప్తి చెందుతుందని అవగాహన కల్పించారు. తద్వారా వ్యాపించే వ్యాధులను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సురేష్, అయ్యుబాయి, అంగన్వాడీ, ఆశాలు ఉన్నారు.



మందూ లేదు.. మాకూ లేదు..

- సర్కారు దవాఖానాకు సుస్తీ
- రెండు నెలలుగా మందుల కొరత
- చిన్న పిల్లల మందులకు సైతం అవస్థలే
- సీజనల్ వ్యాధుల వేళ రోగుల అవస్థలు



నవతెలంగాణ-తలమడుగు

ఆ దవాఖానా పేరుకే ఉంది అంటే ఉంది అన్నట్లు తయారైంది. అక్కడ మందూ లేదు.. మాకూ లేదు.. రోగమొచ్చిందని వెళ్తే ఇలా చూసి అలా చీటీ రాసి పంపించేస్తున్నారు. మరి మందులు గోలీలు ఎట్లా అనుకుంటున్నారా.. మందుల షాపులోకెళ్లి కొనుక్కోవాల్సిందే లేకపోతే జిల్లా కేంద్రంలోని దవాఖానాకు పరుగులు తీయాల్సిందే.. రెండు నెలలుగా మందులు లేవు గోలీలు లేవు వర్షాకాలం జబ్బుల సీజన్ కావడంతో సర్కారు దవాఖానా సమస్యల కార్ఖనాగా మారిందని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఏండ్లకేండ్లు గడుస్తున్నా ప్రభుత్వాలు మారుతున్నా ప్రజల సమస్యలకు సరైన పరిష్కారం చూపేవారే కనిపించడం లేదు. ఇప్పటికీ వర్షాకాలం వస్తే చిన్న చిన్న వ్యాధులకే వణికిపోతున్న జనం ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. తలమడుగు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉన్నప్పటికీ అందులో కొంత సిబ్బంది కొరత ఉన్నా.. చికిత్స అందించడంలో తోడ్పడే మందులు గోళీలు అందించలేని పరిస్థితి నెలకొంది. దీంతో మండల ప్రజలు ప్రయివేటు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోంది. మండలంలో 28 గ్రామ పంచాయతీలున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోగాలు ప్రబలుతున్నాయి. ప్రజలు జ్వరం, దగ్గు, జలుబు వంటి రోగాలతో మండలకేంద్రంలోని ఆస్పత్రికి వైద్యం కోసం వస్తే ఇక్కడ సిబ్బంది రోగులను పరిశీలించి, మందులు గోలీలు బయట తీసుకోవాలని చెప్పకనే చెబుతున్నారు. కొంతమంది రోగులు ఇదేంటని అడిగితే రెండు నెలలుగా మందులు సరఫరా కావడం లేదంటూ వైద్య సిబ్బంది సమాధానం ఇస్తున్నారు. అత్యావసర సమయాల్లో వైద్య సిబ్బంది తమ జెబు నుంచి ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉన్నదంటే అర్థం గతంలో అనేకసార్లు మందులు కావాలని అడిగినప్పటికీ పై అధికారులు పంపించడం లేదు. పై నుంచి సరఫరా కావడం లేదని చెబుతున్నారు. జ్వరం, దగ్గు, జలుబుతో పాటు 30 రకాల వ్యాధులకు సంబంధించిన మందులు లేకపోవడం పట్ల రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఎసిడిటికి పనికి వచ్చే మందుల కొరత ఉన్నదంటే ప్రభుత్వ ఆస్పత్రి పనితీరు అర్థం చేసుకోవచ్చు. ప్రత్యేకించి చిన్న పిల్లల మందులు అసలే లేకపోవడంతో సదరు డాక్టర్ మనసు చంపుకొని, ఉన్న మందులనే రాయాల్సి పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో చిన్న పిల్లలకు దగ్గు, జలుబుతో పాటు జ్వరం ప్రబలుతోంది. దీంతో ప్రజలు స్థోమత ఉన్నవారు ప్రయివేటు వైద్యం వైపు పరుగులు తీస్తున్నారు. పేద రోగుల సంగతేమిటి జబ్బు వస్తే మరణమేనా అనే ప్రశ్న తలెత్తుతుంది. చిన్న పిల్లలకు అవసరమైన మందుల నిల్వలు లేకపోవడంతో ఇక్కడ సిబ్బంది వ్యాధి నయం అయినా కాకపోయినా ఉన్న మందులనే రోగులకు అందిస్తున్నారు. మందులు బయట కొనుగోలు చేసుకోవాలని కోరితే రోగులు గొడవ పడతారేమోనని వైద్య సిబ్బంది సైతం భయపడిన పరిస్థితి ఏర్పడింది. రోగులు జబ్బు వస్తే దానికి సంబంధించిన మందులనే రాయాలి కానీ ఉన్న మందులు రాసి ఇవ్వడం పట్ల వ్యాధులు కూడా నయం కానీ పరిస్థితి ఏర్పడుతుంది. ఈ మాత్రానికైతే ఇక్కడిదాకా రావాలా అని కొంతమంది రోగులు ప్రజలు వైద్య సిబ్బందిపై మండిపడుతున్నారు. వైద్య సిబ్బంది ఇది మా తప్పిదం కాదని పై నుంచి మందుల సరఫరా నిలిచిపోయిందని చెబుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఆయా గ్రామాల్లో దోమలు, ఈగలు ముసురుకుంటున్నాయి. దీంతో ప్రజలు జబ్బుల బారిన పడుతున్నారు. వివిధ సబ్ సెంటర్లలో మందుల నిల్వలు లేక మండల కేంద్రంలోని ఆస్పత్రికి పంపిస్తున్నారు. ఇక్కడా కూడా మందులు లేక వైద్యం అందని దుస్థితి నెలకొంది. ఇప్పుడే ఇలా ఉంటే భారీ వర్షాలతో రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయి. అధికారులు స్పందించి వెంటనే వివిధ రోగాలకు సంబంధించిన మందులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.



సీఐటీయూ భవన నిర్మాణ కరపత్రాల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఇచ్చోడ

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీఐటీయూ భవన నిర్మాణ కోసం ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో స్థానిక కార్మికుల సంఘం నాయకులతో కలిసి సీఐటీయూ భవన నిర్మాణ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ కార్మికుల సమస్యలు, బడుగు బలహీన వర్గాల, రైతుల పక్షనా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడేందుకు జిల్లా కేంద్రంలో సీఐటీయూ భవనం నిర్మాణం ఎంతో అవసరమని అన్నారు. సీఐటీయూ భవన నిర్మాణం కోసం కార్మికులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేతలు, ఉద్యోగులు శ్రేయోభిలాషులు విరాళాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, ఇచ్చోడ మండల నాయకులు కొలపాక అశోక్, యుసుపొద్దీన్, ఆరెపల్లి అంజయ్య, ముక్కరి రాజేశ్వర్, దుబాక రాంబాయి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులైన పిడుగు అభిరామ్‌రెడ్డి, మద్దెల రాజు జన్మదిన వేడుకలను మంగళవారం మండలంతో పాటు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్‌తో పాటు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించారు. యువ నాయకులైన పిడుగు అభిరామ్‌రెడ్డి, రాజు ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి మొట్టె కిరణ్, మండల కన్వీనర్ తోట వెంకటేష్, గంగాధర్, ప్రకాష్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రమాకాంత్, ప్రశాంత్, తిరుమల్‌గౌడ్, పాండురంగ్, చందు, శ్రీను, వామన్, శ్రీనివాస్, కిషన్, ఆశన్న యాదవ్, నర్సింగ్, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సౌండ్ సిస్టం అందజేత



నవతెలంగాణ-తలమడుగు

1987-88 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మంగళవారం తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాలకు రూ.25 వేల విలువగల సౌండ్ సిస్టంను అందజేశారు. ప్రార్థనతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడుతుందనే ఉద్యేశంతో రూ.25 వేల విలువ గల సౌండ్ సిస్టమ్ ఆ పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అందజేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు జి.వెంకట్‌రావ్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. అన్ని బ్యాచ్‌ల విద్యార్థులు ఈ విధంగా అందరూ పాఠశాల అభివృద్ధికి సహకరించడానికి ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్, వినోద్ రెడ్డి, మురళీధర్, రాకేష్, రవీంద్రకుమార్, రాజేందర్, సుమలత, స్వప్న, నర్సయ్య అథాఉల్లాఖాన్, చార్టెడ్ అకౌంటెంట్ రమేష్ కాడే రాములు, డిప్యూటీ తహసీల్దార్ మధుకర్, శివాజీ పాల్గొన్నారు.

నెంబర్ ప్లేట్ లేకుంటే చీటింగ్ కేసులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు రోడ్లపైకి వస్తే చీటింగ్ కేసులను నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని కలెక్టర్ చౌరస్తాలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, పలు ద్విచక్ర వాహనాలను పట్టుకున్నారు. నెంబర్ ప్లేట్ బిగించిన తరువాత పాత చలాన్లు ఉంటే వానిని కట్టించి, వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ పట్టణంలోని నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు తిరుగుతున్నాయని తెలిపారు. గతంలో కూడా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి హెచ్చరించడం జరిగిందన్నారు. అయిన మార్పు రాని కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామన్నారు. ఒక్కరోజే దాదాపు 50 ద్విచక్రవాహనాలను పట్టుకున్నామని తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు రోడ్లపైకి వస్తే చీటింగ్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తు సురక్షితంగా ఇండ్లకు చేరుకోవాలని సూచించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-బేల

ఆడబిడ్డ పెండ్లి చేసి ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు కల్యాణ లక్ష్మి చెక్కులు వారికి తోడ్పాటును అందిస్తోందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో 97 మంది కల్యాణ లక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కళ్యాణ లక్ష్మి చెక్కులతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు అందించే సాయం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం రూ.1,00,116తో పాటు తులం బంగారం కూడా లబ్దిదారులకు ఇవ్వాలని అన్నారు. చెక్కులు నేరుగా తమ బ్యాంక్ ఖాతాల్లో వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వనిత ఠాక్రె, జెడ్పీటీసీ అక్షిత పవార్, కొగ్దూర్ ఎంపీటీసీ అర్చన ఠాక్రె, సిర్సన్న ఎంపీటీసీ మినక నగేష్ రెడ్డి, తహసీల్దార్ సవాయి సింగ్, ఎంపీడీఓ మహేందర్, బీజేపీ మండలాధ్యక్షులు దత్త నిక్కం, పార్టీ మండల నాయకులు శివ కుమార్, వట్టిపెల్లి ఇంద్రశేఖర్, బోడుకుంట రాకేష్, ప్రదీప్ ఖోడే, సందీప్ ఠాక్రె, విజయ్ బోయర్, మురళీధర్ ఠాక్రె పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



నవతెలంగాణ-లోకేశ్వరం

సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటి ఆవరణ, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని పంచాయతీ కార్యదర్శి కదంబ మహేష్ కోరారు. మంగళవారం మండలంలోని రాజూర గ్రామంలోని ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వార్డుల్లో పర్యటించి, పాత కుండలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిని సిబ్బందితో పారబోయించారు. ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు పుప్పాల పద్మ, దేవోల్ల శోభ, శిరీష జోషి, ఏఎన్ఎం గోదావరి, ఆశ కార్యకర్తలు, టీకె శ్రీలత, ఆర్ల మమత, టీకె సవిత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని ఏక కాలంలో పూర్తిగా మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే చెందుతుందని, మండల కాంగ్రెస్ నాయకులు మెస్రం నాగ్‌నాథ్, ఉత్తంలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి ఫోటోకు పాలాభిషేకం చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ వరంగల్ డిక్లరేషన్ ప్రకారం ఏక కాలములో రెండు లక్షల రుణమాఫీని చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగోరావ్, యాకూబ్ బేగ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తెలుగుతో పాటు ఇంగ్లీష్ నేర్పించాలి

- కలెక్టర్ రాజర్షిషా
- అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా, జిల్లా అధికారులు

నవతెలంగాణ-నార్నూర్

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రి స్కూల్ పిల్లలకు అంగన్‌వాడీ టీచర్‌లు తెలుగు హిందీతో పాటు ఇంగ్లీష్ భాషను నేర్పించాలని, జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటించారు. ఇందులో భాగంగా జామడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. వర్ష కాలంలో చిన్నారులకు ఇబ్బంది కావడంతో భవన నిర్మాణ పనులకు, విద్యుత్, ఫ్యాన్, నీటి తదితర సౌకర్యం కోసం రెండు లక్షలతో నిర్మాణ పనులను చేపట్టాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న పోషక ఆహారం, పాలు, గుడ్లు, బాలామృతం, బియ్యం, పప్పు స్టాక్ గర్భిణులు, బాలింతల రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. రక్తహీనత లేకుండా గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పౌష్టిక ఆహారం అందించాలని సీడీపీఓ శారదను అంగన్‌వాడీ టీచర్ పంచశీలను ఆదేశించారు. నెలనెలా పాలు గుడ్లు, పౌష్టికాహారం అందుతుందా అని గర్భిణులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని మాన్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రాజులగూడ ఫాంక్షన్ హాల్‌లో అధికారులతో నితి అయోగ్ సంపూర్ణ అభియాన్‌లో భాగంగా సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్య వైద్యం, అంగన్‌వాడీ నిర్వహణ, సమాఖ్య మహిళ సంఘాల రుణాలు, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, గ్రామాల్లో నెలకొన్న పనులపై ఆరా తీశారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో ఆశా అంగన్‌వాడీ, కార్యదర్శులు అందరి భాగస్వామ్యంతో క్లోరినేషన్ చేయాలని సూచించారు. వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండ గర్భిణుల వివరాలు ఆన్‌లైన్ రికార్డులో పొందుపర్చలన్నారు. ఇప్పటి వరకు కొంత మంది గర్భిణుల వివరాలు నమోదు చేయక పోవడంతో డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, ఏఎన్ఎంలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రణాళిక ప్రకారం గ్రామాల్లో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలన్నారు. గర్భిణీలు వంద శాతం ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో ఆగష్టు 31 వరకు విద్యార్థులకు ప్రవేశం కల్పించి, సంఖ్యను పెంచాలని ప్రధానోపాధ్యాయుల ఆదేశించారు. సమైఖ్య సంఘాల ద్వారా కుట్టే విద్యార్థుల యునిఫాంను గడువులోగా పాఠశాలకు అందజేయాలని ఏపీఎం రమేష్‌ను ఆదేశించారు. రైతులు ఎక్కువ ఏ పంటలు వేస్తారని ఏఓ రమేష్‌ను ప్రశ్నించగా, 21 వేల ఎకరాల్లో రైతులు పత్తి వేశారని, ఫర్టిలైజర్ దుకాణంలో మొత్తం 30 వేల పత్తి విత్తనాల ప్యాకెట్‌లు అందుబాటులో ఉందని అన్నారు. నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టామన్నారు. అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఐటీడీఏ పాఠశాలలో విద్యార్థుల సకల సౌకర్యాలను కల్పించడానికి తీసుకొచ్చిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వర్షకాలం నేపథ్యంలో రోడ్డు సమస్య ఉన్న లోతట్టు గ్రామాలకు ముందస్తుగా రేషన్ బియ్యం, అంగన్‌వాడీ సరుకులను అందుబాటులో ఉంచాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్త, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, డీఆర్డిఓ సాయన్న, డీడబ్ల్యూఓ మిల్కా, ఐటీడీఏ ఈఈ రాథోడ్ భీంరావ్, డీఎల్పిఓ గంగాధర్, ఎంపీడీఓ జవహర్‌లాల్, తహసీల్దార్ రాజలింగం, డీఈ శ్రీనివాస్, ఏఈలు సునీల్, ఘభాని, లింగన్న సీడీపీఓ శారద, ఏఓ రమేష్, ఏపీఎం రమేష్, ఏపీఓ సురేష్ జాదవ్, డాక్టర్ రాంబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దళారులను నమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే పాయల శంకర్
- 302మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కుల అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ పథకాల కోసం లబ్దిదారులు దళారులను నమ్మి డబ్బులు ఇవ్వద్దని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, మావల మండలాలకు సంబంధించిన 302 మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదింటి ఆడ పిల్లల కోసం తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులు పడొద్దని ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజాప్రతినిధులు ఎవరైన ప్రజా సంక్షేమమే వారి అంతిమ లక్ష్యమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన షాదీముబాకర్, కల్యాణ లక్ష్మీ పథకాలను కాంగ్రెస్ కొనసాగించడం సంతోషకరమన్నారు. ఎన్నికల సందర్భంగా పథకంలో తులం బంగారం కూడా ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. దానిపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. అదే విధంగా నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజానీ, సుభాష్ నగర్ కౌన్సిలర్ డా.దర్శనాల లక్ష్మణ్, ఆదిలాబాద్ అర్బన్, రూరల్, మావల తహసీల్దార్లు శ్రీనివాస్, దిలీప్ కుమార్, వేణుగోపాల్, రెవెన్యూ అధికారులు, బీజేపీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | జూన్ 26, 2024 | www.navatelangana.com

ఏజెన్సీ రైతులకు రైతు భరోసా అందించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఏజెన్సీ ప్రాంతంలో వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు రైతు భరోసాలో కోతలు విధించవద్దని, ఎంత భూమి ఉంటే దాని మొత్తానికి పెట్టుబడి సాయం అందించాలని ఆదివాసీ రైతు సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాలింషా డిమాండ్ చేశారు. మంగళవారం వ్యవసాయ అధికారులు రైతు అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించగా జనకాపూర్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో మెట్ట భూములు ఎక్కువ శాతం ఉండడం వల్ల నీటి వసతి లేక వర్షాధారంపై ఆధారపడి వ్యవసాయం చేస్తూ జీవిస్తారన్నారు. ప్రభుత్వం గిరిజన రైతులను ఆదుకోవాలని కోరారు. ఆయన వెంట రైతులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని పిప్పర్‌గొంది గ్రామానికి చెందిన జావిద్ సురేఖ 108 అంబులెన్స్‌లో కవల పిల్లలకు జన్మనిచ్చింది. ఉదయం పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. సరైన సమయానికి అంబులెన్స్ రావడంతో సురేఖను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. తల్లి, పిల్లలు క్షేమంగా ఉన్నారు. 108 సేవలు చాలా బాగున్నాయని కుటుంబ సభ్యులు సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కొబ్బరి సాగు విధానాలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బు గుప్తా ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని మొదటిసారిగా కొబ్బరి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి హాజరైన కొబ్బరి అభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ కుమారవేల్, ఉద్యానవన శాస్త్రవేత్తలు డాక్టర్ మురళి, డాక్టర్ స్రవంతి కొబ్బరి సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నది తీర ప్రాంతాలలో కొబ్బరి సాగుకు అనుకూలమని, ఆసక్తి గల రైతులు కొబ్బరి సాగుపై వచ్చే పథకాలు రాయితీలను ఉపయోగించుకొని సాగును చేపట్టాలని సూచించారు. ఆయిల్ ఫామ్ సాగున్న ప్రాంతాలలో కొబ్బరి సాగు చేయవచ్చునని, సాగు విధానం, అంతర కృషి, అంతర పంటలు, నీటి, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణ గురించి రైతులకు వివరించారు. కొబ్బరి మొక్కలు నాటే విధానాన్ని రైతులకు ప్రొజెక్టర్ ద్వారా చూపించారు. అవగాహన సదస్సుకు 200కు పైగా రైతులు హాజరయ్యారు. అనంతరం హాజరైన రైతులకు ఒక్కొక్కరికి ఐదు మొక్కలను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి సందీప్, హార్టికల్చర్ అధికారి శాంతిప్రియ, సుధీర్ కుమార్, ఏడీఏ రాజుల నాయుడు, ఏఈఓలు శ్రీవిద్య, రవి తేజ, మారుతి, శ్రీధర్, ఐటీడీఏ సిబ్బంది రమేష్, జయరాజు, చందర్, సీడీపీ అధికారులు కిరణ్, సురేష్, ఎంపీటీసీ దూగుంట రాజన్న, కో ఆప్షన్ సభ్యుడు సాజిత్, రైతులు పాల్గొన్నారు.

సాగులో సందేహాలుంటే సంప్రదించండి

- ఏఓ రామక్రిష్ణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రస్తుతం పత్తి సాగు ప్రారంభమవుతున్న దృశ్యా రైతులకు సాగులో ఎలాంటి సందేహాలున్నా వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలని కాగజ్‌నగర్ మండల వ్యవసాయాధికారి రామక్రిష్ణ తెలిపారు. మండలంలోని అంకుసాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయ అధికారి పంట చెనులను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. పత్తి సాగు చేసిన రైతుల వివరాలని అడిగి తెలుసుకున్నారు. రైతులు ఏ పంటలు సాగు చేశారో వాటి వివరాలను పంట నమోదు చేసుకోవాలన్నారు. పత్తి పంట సాగుకి జూలై 15 వరకు సమయం ఉందన్నారు. రైతులు ఎరువుల వాడకం తగ్గించాలని కోరారు. సాగు విషయంలో ఎలాంటి సందేహాలున్న వ్యవసాయ అధికారులని సంప్రదించాలన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి



నవతెలంగాణ-కౌటాల

విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని ముత్తంపేట్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు గావుడె హనుమంతు అన్నారు. ముత్యంపేట్ పరిధిలోని పలు ప్రాథమిక పాఠశాలలను పరిశీలించి విద్యార్థులను పఠనం చేయించి ఉపాధ్యాయులకు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఉపాధ్యాయులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సీఆర్పీ గంధం ప్రకాష్ ఉన్నారు.

రేపు పశువుల మార్కెట్ వేలం

నవతెలంగాణ-సిర్పూర్(టి)

మండలంలోని హుడికిలి గ్రామపంచాయతీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరాని గాను పశువుల మార్కెట్ వేలం పాటను ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి హరీష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనేవారు గ్రామపంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండరాదని, ముందుగా రూ.50వేలను గ్రామపంచాయతీ పేరు మీద డిపాజిట్ కట్టాలని, డిపాజిట్ దారుడు మాత్రమే వేలంపాటలో పాడుటకు అర్హుడని, వేలం పూర్తైన తర్వాత వేలం పాట దక్కించుకున్న వారు వారి డిపాజిట్ డబ్బులు ఆపి మిగతా వారికి డబ్బులు తిరిగి ఇస్తామన్నారు. వేలంపాట దక్కించుకున్న వారు అదే రోజు డబ్బులు కట్టాల్సి ఉంటుందన్నారు. వేలంలో సరైన ధర రానిపక్షంలో రెండో పాటపై వేలం వేయబడుతుందని, వేలం గిట్టుబాటు ధర రాని ఎడల నిలిపివేసే అధికారం ఉంటుందన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు మరిన్ని వివరాలకు గ్రామపంచాయతీ సిబ్బందిని సంప్రదించాలని అన్నారు.

జూలై 1న సర్వ సభ్య సమావేశం

నవతెలంగాణ-కెరమెరి

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జూలై 1న సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ అంజత్ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు, మండలంలోని వివిధ శాఖల మండల స్థాయి అధికారులు తమతమ నివేధికలతో సకాలంలో సర్వసభ్య సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చూడాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సిజేరియన్ చేసుకున్న మహిళలకు పండ్లను అందిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, అదే సమయంలో ఇక్కడ ప్రసవాలు జరిగేలా చూడాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే వైద్యులను సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో సిజేరియన్ ద్వారా మగబిడ్డకు జన్మనిచ్చిన ఆసిఫాబాద్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన లోబాడే శోభాను అభినందించి పండ్లు అందించారు. ఈ శస్త్రచికిత్స జరిపిన వైద్యులు, సిబ్బందిని అభినందించి పలు సూచనలు చేశారు. ప్రతి గర్భిణీకి అవసరమైన పరీక్షలు చేసి జిల్లా ఆస్పత్రిలో సురక్షిత కాన్పు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఆస్పత్రిలో ఎక్కువ సంఖ్యలో ప్రసవాలు జరిగేలా చూడాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. కాన్పులకు ప్రయివేటుకు వెళ్లడంవల్ల ఆర్థిక భారంతో పాటు రోగుల ఆరోగ్యానికి అభద్రత ఉంటుందన్నారు. ఆపరేషన్ థియేటర్‌లోని వసతులపై సూపరింటెండెంట్‌ని అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా నడుచుకోవాలన్నారు. రోగులకు వ్యాధి పూర్తిగా నయమయిన తరువాతనే పంపించాలన్నారు. వర్షాకాలం కావడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులతో రోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున అవసరమైన బెడ్లు, మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై స్థలాన్ని పరిశీలించి, అధికారులు, మహిళా సంఘాలతో చర్చించారు. మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా ఆసుపత్రిలో వచ్చే రోగులకు, సంబంధీకులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందడంతో పాటు మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు. మహిళ సంఘాలు కూడా ఆ దిశగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ చెన్నకేశవులు, వైద్యులు, సిబ్బంది, సహాయ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలి

- ఎస్పీ డివి శ్రీనివాస్
- పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి
- పోలీస్‌స్టేషన్ల తనిఖీ



బెజ్జూర్ : రికార్డుల గురించి తెలుసుకుంటున్న ఎస్పీ డివి శ్రీనివాస్

నవతెలంగాణ-బెజ్జూర్

పోలీసు స్టేషన్‌కు వచ్చే బాదిలులకు తక్షణ న్యాయం జరిగేలా పోలీసులు కృషి చేయాలని ఎస్పీ డివి శ్రీనివాస్ సూచించారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని కౌటాల సర్కిల్ పరిధి లోగల బెజ్జూర్, సిర్పూర్-టి, చింతలమానపల్లి పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను, రిసెప్షన్, స్టేషన్ రైటర్, ఎస్‌హెచ్ఓ, రెస్ట్ రూమ్, లాక్ అప్ రూమ్‌తో పాటు 5ఎస్ అమలు తీరును పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు.. ఏఏ విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్‌గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా పూర్వకంగా నడుచుకోవాలన్నారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం గస్తీ నిర్వహించాలన్నారు. సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల పూర్తి సమాచారం దగ్గర ఉండాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలతోపాటు యువతను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటల సీఐ సాదిక్ పాషా, ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్ (టి) : పెండింగ్ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఎస్పీ డివి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. రికార్డులు, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకుని వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట డీఎస్పీ కరుణాకర్, కౌటల సీఐ సాదిక్ పాషా, ఎస్‌బీ సీఐ రాణా ప్రతాప్ ఉన్నారు.

కౌటాల : పోలీస్ అధికారులు విదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డి.వి.నివాస్ రావు పోలీసులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చిన ఆయనకు పోలీసులు స్వాగతం పలికారు. సిబ్బంది అందరూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మహారాష్ట్ర సరిహద్దున ఉండడంతో నేరాల అదుపుకు అప్రమత్తంగా ఉంటూ అరికట్టాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేల అవగాహన కల్పించాలన్నారు.



కౌటాల : సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ డివి శ్రీనివాస్



సిర్పూర్(టి) : సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ డివి శ్రీనివాస్

మహిళల ఆర్థిక పరిపుష్టియే ప్రధాన లక్ష్యం

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమం తీసుకువచ్చిందని, లక్ష్యసాధన కోసం సమాగ్ర కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి మహిళా శక్తి కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి లక్ష్యంతో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అందులో భాగంగానే పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టేపనిని వారికే అప్పగించిందని తెలిపారు. మహిళా శక్తి కింద మైక్రో ఎంట్రప్రెన్యూర్స్, కుట్టుకేంద్రాలు, పాడిపశువులు, సంచార మత్స్య విక్రయ అవుట్‌లెట్లు, మిల్క్ పార్లర్స్, మీసేవ, ఈవెంట్ మేనేజ్మెంట్, మహిళా క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్స్ వంటి 15 రకాల కార్యకలాపాలు చేపట్టేందుకు మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లాలో గల మహిళా సంఘాలకు 78 మీసేవా కేంద్రాలు నెలకొల్పడం ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చున్నారు. ఔత్సాహిక మహిళా సంఘాలను చేపల పెంపకం వైపు ప్రోత్సహించాలన్నారు. ఆయా మండలాల్లో అవసరమైన మహిళా శక్తి యూనిట్లను గుర్తించి కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు. వ్యవసాయ యంత్రాలను అద్దెకివ్వడం ద్వారా మరింత ఆదాయం పొందవచ్చునన్నారు. మిగిలిన మండలాల్లో వ్యవసాయ యంత్రాల యూనిట్లను ప్రారంభించాలన్నారు. ఈ కార్యాచరణ ప్రకారం వివిధ మండలాలలో గల మహిళా సమాఖ్యలోని స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుండే కార్యాచరణకు శ్రీకారం చుట్టాలన్నారు. ఇందుకోసం మహిళలు బ్యాంకు రుణాలను, స్త్రీ నిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ రామకృష్ణ, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

మాదిగల ఐక్యత చాటేలా వారోత్సవాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాదిగల ఐక్యత చాటే విధంగా జులై 7న రవీంద్ర భారతిలో మాదిగల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని మాదిగలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బొమ్మెన ధర్మయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో మాదిగల వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగల ఐక్యతను చాటే విధంగా వారోత్సవాలు టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఐక్యంగా ఉన్నప్పుడు హక్కుల సాధన సాధ్యమవుతుందన్నారు. ఐక్యతను చాటే విధంగా పెద్ద ఎత్తున జిల్లా నుండి మాదిగలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు



శనిగారపు మల్లేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోతే లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి విలాస్, మండల నాయకులు తిరుపతి, రాజేష్, కిషోర్, మల్లేష్, రాజయ్య, చందర్ పాల్గొన్నారు.

నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉంచాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుత వర్షాకాలంలో వివిధ ప్రాంతాల్లో నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన నర్సరీని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి సందర్శించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మొక్కలు ఎండిపోకుండా, వ్యాధులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. త్వరలో ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టే వజ్రోత్సవ వనమహోత్సవ కార్యక్రమానికి అవసరమయ్యే మొక్కలను సిద్ధం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. విత్తనాలు పెట్టినపుడు తప్పనిసరిగా నీళ్ల చల్లాలని, కలుపు మొక్కలను మొదట్లోనే గుర్తించి తొలగించాలన్నారు. నర్సరీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి వివరించారు. మొక్కల ఎదుగుదలకు జీవామృతం తగు సమయంలో అందించాలని తెలిపారు. అలాగే పల్లె ప్రకృతి వనాలు గ్రామ ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేలా చూడాలన్నారు. వాటిని సంరక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్పీఓ ఒమర్ హుస్సేన్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కుటుంబానికి అండగా ఉంటా

- డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-దహెగాం

లైంగికదాడికి గురై హత్యకు గురైన చిన్నారి కుటుంబానికి ఎల్లప్పుడు అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని చిన్నారి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏరకంగా ఉన్నాయో ఈ సంఘటన ద్వారా అర్థం చేసుకోవచ్చున్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా నిందితులకు త్వరలోనే కఠిన కారాగార శిక్ష పడేలా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం వెంటనే గృహ నిర్మాణం చేసి ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం చిన్నారి కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్కరి ప్రశాంత్, షాకీర్, వెల్మలే గులాబ్, మహేందర్, నారాయణ, అంజి, షేక్ బాబు, శంకర్. శ్రీకాంత్, సంపత్, ఉదయ్, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

- కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్



నవతెలంగాణ-రెబ్బెన

మాదకద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సతీష్ అన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఎంతో ప్రధానమైనదన్నారు. ఈ దశలో చెడు వ్యసనాలకు బానిసయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య అందించడమే లక్ష్యం



నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని చిన్న పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడమే లక్ష్యమని సీడీపీఓ రెబిక అన్నారు. మండలంలోని బంబారా రైతు వేదికలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు ప్రీ స్కూల్ 2024 అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను ప్రీ ప్రయిమరీ స్కూలుగా తీర్చిదిద్దుతుందని తెలిపారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధి జరగాలంటే స్వచ్ఛ వాతావరణంలో ఆటపాటల ద్వారా పిల్లలకు విద్యను అందించాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లకు, సూపర్‌వైజర్లకు చిన్నారులను ఆకట్టుకునేలా బోధన తీరును వివరిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలంలోని సూపర్‌వైజర్లు కళావతి, లత, భారతి, కుమారి, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
బుధవారం | జూన్ 26, 2024 | www.navatelangana.com

అటవీ ఆంక్షలు ఎత్తివేయాలి

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ అభయారణ్యంలో భారీ వాహనాలకు పెట్టిన ఆంక్షలు ఎత్తివేయకపోతే ఈ ప్రాంత ప్రజలకు భవిష్యత్ లేదని జన్నారం పట్టణానికి చెందిన సామాజికవేత్త భూమాచారి అన్నారు. అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ మంగళవారం ఆయన మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో ఫ్లెక్సీ ధరించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల అభివృద్ధిపై అటవీ ఆంక్షల ప్రభావం, తదితర అంశాలను ప్రజలకు వివరించారు. తమ ఉద్యమానికి ప్రజలు కలిసి రావాలని కోరారు. కార్యక్రమంలో ఇలియాస్, కంతం తిరుపతి, దాసరి తిరుపతి, కొండపల్లి మహేష్, చుంచు వినయ్, కొమురవెల్లి అశోక్, ఉప్పల కిషోర్, ఉప్పుల సుదర్శన్ పాల్గొన్నారు.

వాహనాలు నడిపే వారు జాగ్రత్త వహించాలి

నవతెలంగాణ-నస్పూర్



వాహనాల యజమాని, డ్రైవర్‌లు జాగ్రత్త వహించాలని, అజాగ్రత్తగా ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని శ్రీరాంపూర్ సీఐ మోహన్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో వాహనాల యజమానులు, డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆటోల ఫిట్నెస్, ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, మద్యం తాగి నడపకూడదని, ఆటో నడిపే ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని, ఓవర్ స్పీడుగా వెళ్ళొద్దని సూచించారు. స్కూల్‌కి తీసుకెళ్లే పిల్లలను, ప్రయాణికులను, జాగ్రత్తగా తీసుకెళ్లాలన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల రక్షణపై షీటీం భరోసా



నవతెలంగాణ-నస్పూర్

మీ రక్షణ మా బాధ్యత అని మహిళల రక్షణపై షీ టీం భరోసా కల్పిస్తూ అవగాహన కార్యమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే మంగళవారం శ్రీరాంపూర్‌లోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో షీ టీం కానిస్టేబుల్స్ జ్యోతి, సతీష్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ నేరాల గురించి వివరించి సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930కి సమాచారం ఇవ్వాలన్నారు. అకతాయిల నుండి మహిళలు, బాలికలకు ఏవైనా వేధింపులు ఎదురైతే షీటీమ్ నంబర్ 6303923700 సంప్రదించాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చెయొచ్చని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతామన్నారు. కార్యక్రమంలో భరోసా సెంటర్ కోఆర్డినేటర్ విజయ, సబ్ ఆర్డినేట్ ప్రియాంక, పాఠశాల ప్రిన్సిపాల్ జాహీద బేగం, కరస్పాండెంట్ జక్కెన రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని చెరుకుగూడ గ్రామానికి చెందిన రాజన్న (50) ఈనెల 20న లక్షెట్టిపేట ఆంధ్ర బోర్ వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం అతనిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. కరీంనగర్‌లోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు లక్షెటిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు రాజన్నకు ఇద్దరు ఆడపిల్లలున్నారు.

విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-కాసిపేట

విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ, సైబర్ క్రైమ్స్, ఆత్మహత్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు అలవాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు, రవాణా, వినియోగం లాంటి చర్యలకు పాల్పడినట్లుగా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు పెరుగుతుండటంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలిపారు. మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని, తల్లిదండ్రుల, పరీక్షలు ముగిసిన తరువాత తమ ఇంటికి వెళ్ళాక చుట్టూ ప్రక్కల వారికి, మీ గ్రామంలో కూడా సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి పాఠశాలల బంద్ విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జన్నారం

ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జూన్ 26న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాల బంద్ విజయవంతం చేయాలని ఏబీవీపీ విభాగ్ ఖేల్ కన్వీనర్ పందిరి మనీష్ కోరారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సంవత్సరాల తరపడి ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదన్నారు. మౌలిక వసతులు, ఉపాధ్యాయులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలలు లక్షలకు లక్షలు ఫీజులు దండుకుంటున్న పట్టించుకోకుండా కేవలం చర్యలు తీసుకుంటామంటూ హామీలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ప్రయివేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు దోపిడీ ఆరికట్టడం, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ 26న పాఠశాలలు బంద్‌కు ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపునిచ్చిందని తెలిపారు. పాఠశాల యాజమాన్యాలకు బంద్ సహకరించి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులు మీ కోసమే..!

- గ్రామీణ ప్రాంతాల వారి సమస్యల పరిష్కారానికి కృషి
- రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



సమస్యలు అడిగి తెల్సుకుంటున్న సీపీ శ్రీనివాస్

నవతెలంగాణ-జైపూర్

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడం, శాంతి భద్రతలను పరిరక్షించాలన్న లక్ష్యంతో రామగుండం కమీషనరేట్ పరిధిలో గల గ్రామాల్లో పోలీస్ నైట్‌హాల్ట్ కార్యక్రమాన్ని సీపీ శ్రీనివాస్ చేపట్టారు. ఈ కార్యక్రమం ద్వార గ్రామీణ ప్రాంతాల వారికి పోలీసుల పట్ల భరోసా కల్పించాలన్న లక్ష్యంతో పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమాన్ని రూపొందించిన సీపీ సోమవారం చెన్నూర్ మండలం ఆస్నాద్ గ్రామంలో నైట్ హాల్ట్ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రజలతో కలిసిపోయిన ఆయన స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో స్నేహ భావం పెంపొందించుకోవాలని సూచించిన ఆయన సమస్యల పరిష్కారం కోసం పోలీసులను ఆశ్రయించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత ఇతర శాఖల వారికి సిఫార్సు చేసి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఇక్కడ ఎక్కువగా నమోదైన కేసుల వివరాలు, లా అండ్ ఆర్డర్, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యువకులు చెడు వ్యసనాలకు బానిసై విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. విద్యార్థి దశ నుండి మంచి ఆలోచనా విధానంతో పట్టుదలగా చదివి ఉద్యోగాలు సంపాదించుకోవాలని సూచించారు. గంజాయి, మద్యం, పేకాట ఇతర అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. రైతులు నకిలీ విత్తనాలతో నష్టపోకుండా నాణ్యమైన విత్తనాలను తీసుకోవాలన్నారు. అనుమానస్పద వ్యక్తుల కదలికల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గ్రామ పంచాయతీల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించవద్దని సూచించారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన విద్యాభ్యాసం కొనసాగుతున్న తీరు ఆరా తీసి చదువుల పట్ల ఆసక్తి పెంచుకోవడంతో పాటు జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోంచాలంటే కష్టపడి చదువుకోవాలని సూచించారు. పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేందర్ రావు, చెన్నూర్ టౌన్ ఇన్స్‌పెక్టర్ రవిందర్, ఎబీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై శ్వేత పాల్గొన్నారు.



ఆస్నాద్‌లో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు, విద్యార్థులు

గనుల పని స్థలాల విస్తరణలో రెస్క్యూ సేవలు బేష్



నవతెలంగాణ-నస్పూర్

గనుల పని స్థలాల విస్తరణలో రెస్క్యూ సేవలు అనిర్వచనియమని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. సింగరేణిలో రెస్క్యూ సిబ్బంది సేవలు అత్యవసర సమయాల్లోనే కాక శ్రీరాంపూర్ ఏరియాలో ఉత్పత్తి లక్ష్యాలకు అవసరమైన కష్ట సాధ్యమైన పనుల్లో గని విస్తరణకు విశేషసేవలు అందిస్తున్న సిబ్బందిని మంగళవారం జనరల్ మేనేజర్ (రెస్క్యూ) ఎస్.వెంకటేశ్వర్లుతో కలిసి అభినందించారు. ఈ నెలలో పదవీ విరమణ పొందనున్న జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లును శ్రీరాంపూర్ ఏరియా తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాలకు అనుగుణంగా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని విస్తరణ కోసం, వేసవిలో ఎండతీవ్రత దృష్ట్యా, వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని రెస్క్యూ సిబ్బంది అవసరాన్ని ప్రాజెక్టు అధికారి టి.శ్రీనివాస్ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారన్నారు. కార్పొరేట్ యాజమాన్యం తక్షణమే రెస్క్యూ సిబ్బంది సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ సందర్భంగా రెస్క్యూ సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందుంచారు. కార్యక్రమంలో అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఓ టూ జీఎం వి.పురుషోత్తమ రెడ్డి, ఇందారం ఉపరితల గని ప్రాజెక్టు ఆఫీసర్ ఎం శ్రీనివాస్, ఎస్ఆర్పీ ఓసీ గని ప్రాజెక్ట్ అధికారి టీ.శ్రీనివాస్, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, రాముడు, డీజీఎంలు పి.అరవింద రావు, చిరంజీవులు, శ్రీరాంపూర్ ఉపరితల గని మేనేజర్ బ్రహ్మాజీ, ప్రాజెక్ట్ ఇంజనీర్ చంద్రశేఖర్, రెస్క్యూ అధికారులు రామ్మోహన్, సర్వే అధికారి సంపత్, ఎన్విరాన్మెంట్ అధికారి జలాలుద్దీన్ పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-మందమర్రి

సికిల్ సెల్ డే సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం గ్రేస్ లిటిల్ హార్ట్స్ హై స్కూల్లో విద్యార్థులకు సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కల్పించారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉందన్నారు. వ్యాధి రహిత రాష్ట్రంగా మార్చాలని చిన్నపిల్లల నుండి పెండ్లి వయసు వచ్చిన వారు పెండ్లికి ముందు హెచ్‌బీఏ-2 రక్త పరీక్షలు అందరూ చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వము నర్సరీ నుండి పీజీ విద్యార్థులందరికీ సికిల్ సెల్ టెస్టులు నిర్వహించి గుర్తింపు కార్డులను ఇస్తుందన్నారు. జిల్లాలో ప్రసూతి మరణాలలో సికిల్ సెల్ వ్యాధి వల్లనే అధికంగా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి 100 మందిలో ఐదుగురు తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి గ్రస్తులు ఉన్నారని తెలిపారు. వారిని గుర్తించి కౌన్సిలింగ్ చేసి వ్యాధి లక్షణాలున్న ఇద్దరూ పెండ్లి చేసుకోకుండా చూడాలని, ఇలా చేస్తే వ్యాధిని అరికట్టవచ్చాని తెలిపారు. రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకులో వ్యాధి నిర్ధారణ పరీక్ష రూ.500 ఉందని, ప్రతి ఒక్కరు వైద్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రేస్ లిటిల్ హార్ట్స్ హై స్కూల్ హెడ్ మాస్టర్ శ్యామ్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్ కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు ప్రోత్సాహక నిధులు విడుదల

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు 2 సంవత్సరాలకు సంబంధించిన మెంటవెన్స్, అంతర పంట సాగు ప్రోత్సహక నిధులు మంజూరైనట్లు ఉద్యానవన శాఖ అధికారి సుప్రజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎకరానికి రూ.4200 చొప్పున రైతులకు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో 59 మంది రైతులు 234 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ సాగు చేస్తుండగా రూ.9,83575 ప్రోత్సాహక నిధులను రైతుల ఖాతాలో జమ చేయడం జరిగిందని తెలిపారు .

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-జైపూర్

భీమారం సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కుమారస్వామి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో దాని స్థానంలో మరో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాడానికి బుధవారం సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు ఈవిషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

సమాచార మార్పిడి వేదికగా అవుట్ రీచ్

నవతెలంగాణ-నస్పూర్

ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన శిబిరం, అవుట్‌రీచ్ ప్రొగ్రామ్ ఫిర్యాదుల పరిష్కారం, సమాచార మార్పిడి వేదికగా పని చేస్తుందని ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ కరీంనగర్ ప్రాంతీయ కార్యాలయం, ప్రాంతీయ పీఎఫ్ కమీషనర్-2 అండ్ ఓఐసీ సెల్వట్కుర్ తానయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. 27న మంచిర్యాలలో ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 5.45 గం.ల వరకు దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్స్ ఫ్యాక్టరిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సభ్యులు, కార్మిక సంఘాలు, యజమానుల సంఘాలు వారి ఫిర్యాదులను పరిష్కరించుకోవడానికి, సూచనలు తెలుసుకోవడానికి జిల్లా అవగాహన శిబిరం, అవుట్‌రీచ్ ప్రొగ్రామానికి హాజరు కావాలని సూచించారు.

స్లేట్ ఎక్స్‌లెన్స్ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికలు



నవతెలంగాణ-జన్నారం

ఈ విద్య సంవత్సరానికి గాను మండల కేంద్రంలోని స్లేట్ ఎక్స్‌లెన్స్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికలలో విద్యార్థులు జాగృతి హౌస్, చేత్న హౌస్, ప్రగతి హౌస్, అనురాగ్ హౌస్‌లు అనే నాలుగు హౌస్‌లుగా విడిపోయి ప్రతి హౌస్ నుండి ఒక హౌస్ కెప్టెన్, వైస్ కెప్టెన్‌గా విభజించారు. అందరూ కలిసి ఒక స్కూల్ కెప్టెన్‌ను అందులో ఒక అబ్బాయి, అమ్మాయిని ఎన్నుకోవడం జరిగుతుందని ప్రిన్సిపల్ తెలిపారు. ప్రతి సంవత్సరం పాఠశాల ప్రారంభంలో ఎన్నికలను నిర్వహిస్తూ విద్యార్థులకు ఎన్నికల పట్ల అవగాహన కల్పించడం, వారు ఎన్నుకోబడిన స్కూల్ కెప్టెన్లు, హౌస్ కెప్టెన్స్, వైస్ కెప్టెన్స్ విధులు, నాయకత్వ విధానాలు, క్రమశిక్షణ విధానాన్ని, విలువలు, బాధ్యతలను గుర్తుచేయడం జరిగిందన్నారు. ఇందులో స్లేట్ గ్రూప్ ఆఫ్ డైరెక్టర్ ఏనుగు రజిత, స్లేట్ గ్రూప్ ఆఫ్ డిన్ పూజ, ప్రిన్సిపాల్ శ్రీ మెర్లిన్ మింటో జాన్ పాల్గొన్నారు.

అంతర్గత పరీక్షలను ఇంగ్లీష్ కూడా నిర్వహించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో నిర్వహించే అంతర్గత పరీక్షలను తెలుగుతో పాటు ఇంగ్లీషులో కూడా నిర్వహించాలని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి వినతిపత్రాన్ని అందజేసినట్లు శ్రీరాంపూర్ ఏరియా ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, ఏరియా మాజీ వైస్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంతర్గత పరీక్షల్లో అర్హులైన అభ్యర్థులతో ఖాళీలను భర్తీ చేయడానికి నిర్వహించే పరీక్షల్లో ద్విభాషా ప్రశ్నాపత్రాలను ఇవ్వాలని కోరారు. కొంతమంది తెలుగులో ప్రశ్నపత్రం రావడం ద్వారా పరీక్ష రాయడానికి ఇబ్బంది పడుతున్నారన్నారు. అంతేకాకుండా పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను పరీక్షకు ముందు బహిర్గతం చేయాలన్నారు. అలాగే పరీక్ష రాసిన తర్వాత అభ్యర్థుల నుండి ప్రశ్నాపత్రాన్ని సేకరిస్తున్నారని, అలాకాకుండా పరీక్ష నిర్వహించినంతరం ప్రశ్నాపత్రాన్ని అభ్యర్థులకు అందజేయాలన్నారు. స్టేట్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ నిర్వహించే ఇతర పరీక్షలకు అనుగుణంగా ఏదైనా పరీక్ష రాసిన తర్వాత ఓఎంఆర్ షీట్‌లను వెబ్‌సైట్‌లో అభ్యర్థులు చూసుకోవడానికి అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రయివేట్ స్కూళ్ల ఫీజుల దోపిడీని అరికట్టాలి

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాల యాజమాన్యాలు బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జంగం సంతోష్ అన్నారు. మంగళవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ ఒక వైపు స్కూల్ ఫీజులని మరో వైపు బుక్స్ ఫీజు అని, ట్రావెలింగ్ అని ఎక్స్‌ట్రా ఫీజులు అని లేని పోనీ ఫీజులు పెట్టి అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మొదటి తరగతి చదివే విద్యార్థికి కావాల్సినంత బుక్స్ కాకుండా ఇంకా ఎక్కువ మోతాదులో బుక్స్ భారాన్ని మోపుతున్నారని అన్నారు. ఫీజులు కట్టకుంటే సమయానికి పరీక్షలు రాయనివ్వడం లేదన్నారు. అధికారులు ప్రయివేట్ పాఠశాలపై చర్యలు తీసుకొవాలని కోరారు.

మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-మందమర్రి

ఉన్నత చదువులలో రాణిస్తున్న విద్యార్థుల తండ్రులకు మంగళవారం జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ మనోహర్ మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. కెకె -5 గనిలో పని చేస్తున్న సముద్రాల బుచ్చయ్య ఆఫీస్ సూపరింటెండెంట్ కుమారుడు సాకెత్ ఎంబీబీఎస్ 5వ సంవత్సరం, ఆర్కేపీఓసీలో ఈపీ ఆపరేటర్ దుంపేటి శంకర్ కుమార్తె అనిల ఎంబీబీఎస్ 5వ సంవత్సరం చదువుతున్నారు. వీరికి రూ. పదివేల చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుతున్న ఉద్యోగుల పిల్లలను ప్రోత్సహించేందుకు సింగరేణి సంస్థ మెరిట్ స్కాలర్‌షిప్‌లను అందిస్తుందని, పిల్లలను ఉన్నత చదువులకి ప్రోత్సహించినందుకు తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, ఏటీసీ రామకృష్ణాపూర్ బ్రాంచ్ సెక్రటరీ అక్బర్ అలీ, సీఎం ఓ ఏఐ అధికారి పైడిశ్వర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆఫీస్ సూపర్ ఇంటర్నెట్ రాజలింగు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ నిలిపివేత

నవతెలంగాణ-నస్పూర్

పాలకవర్గ ఎన్నిక నోటీసు రద్దు చేస్తూ ఎన్నికల ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు మమత వినియోగదారుల సహకార సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ మంచిర్యాల అసిస్టెంట్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి గుండా సందీప్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ హైదరాబాద్ ద్వారా మమత వినియోగదారుల సహకార సెంట్రల్ స్టోర్స్ లిమిటెడ్ మంచిర్యాల సంఘం పాలకవర్గ సభ్యుల ఎన్నికల షెడ్యూల్ రద్దు చేస్తున్నట్లుగా ఉత్తర్వులు జారీ చేసిన ప్రకారంగా జిల్లాలో సంఘం పాలకవర్గ ఎన్నికకు జారీ చేసిన నోటీస్(ఫార్మ్-1)ను రద్దు చేస్తూ ఎన్నికల ప్రక్రియ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

త్వరలో సమస్యలు పరిష్కరిస్తాం : ఆర్డీఓ

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని గడ్‌చాంద గ్రామంలోని పాత ఊరు శివారులో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ భూములను కొందరు వ్యక్తులు అక్రమించి విక్రయిస్తున్నారని సోమవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం భైంసా ఆర్డీఓ కోమల్‌రెడ్డి గ్రామాన్ని సందర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమస్యను పరిష్కరించి, చర్యలు తీసుకుంటామని సమస్య పరిష్కారం అయ్యేంత వరకు గ్రామస్తులు సమన్వయం పాటించాలన్నారు. ఈ క్రమంలో మండల తహసీల్దార్ మోతీరాం, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ బాలకిషన్, గ్రామస్తులు ఉన్నారు.

ఫిట్‌నెస్ లేని 16 ఆటోలు సీజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



సరైన ధ్రువపత్రాలు, ఫిట్‌నెస్ లేని 16 ఆటోలను సీజ్ చేసినట్లు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ హరింద్ర కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణం సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఫిట్‌నెస్, లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని 16 ఆటోలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా తమ ఆటోలకు సంబంధించిన ఫిట్‌నెస్ లైసెన్స్ ఇన్సూరెన్స్, తదితర పత్రాలు దగ్గర పెట్టుకోవాలని సూచించారు. ఇకనుంచి నిరంతర తనిఖీలు చేపడుతామని తెలిపారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు ఆర్టీఓ కార్యాలయంలో ఫిట్‌నెస్ చేయించుకోవాలన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఏబీకేఎంఎస్ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్(ఏబీకేఎంఎస్) ప్రతినిధి బృందం కే.లక్ష్మారెడ్డి నాయకత్వంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిని మంగళవారం ఢిల్లీలో కలిసి అభినందనలు తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులు, పెన్షన్, సురక్ష తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. బొగ్గు పరిశ్రమ కార్మికుల పెన్షన్ ఫండ్‌లో ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్‌కు రూ. 5,000 వేతనం మీద 1.16 శాతం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న విధంగా నిధులను జమ చేయాలని, ఈ విషయం ఆర్థిక మంత్రితో మాట్లాడాలని బృందం కోరింది. కార్యక్రమంలో ఏబీకెఎంఎస్ అధ్యక్షులు టికేశ్వర్ సింఘ్, ప్రధాన కార్యదర్శి సుధీర్ ఘుర్డే, సంఘటనా కార్యదర్శి అశోక్ మిశ్రా, కార్యవర్గ సభ్యులు కుమారి సుష్మిత పటేల్ పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి నిర్మించుకోవాలి



నవతెలంగాణ-జన్నారం

ప్రతి ఇంట్లో మరుగుదొడ్లను నిర్మించుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులు సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని బంగారు తండా, హాస్టల్ తండా, కవ్వాల్ కిష్టాపూర్ తదితర గ్రామాల్లో కార్యదర్శులు ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు మరుగుదొడ్లు నిర్మించుకున్నారా..? లేదో సర్వే చేశారు. ఐహెచ్‌ఎచ్‌ఎల్ సర్వే నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

హోటళ్లలో తనిఖీలు చేపట్టాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షాకాలం నేపథ్యంలో పట్టణంలో పలు హోటల్లు, స్వీట్ హౌస్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో తనిఖీలు చేపట్టాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులు మనోజ్ కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ హైమద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వర్షాకాలం కారణంగా ఈగలు, దోమల నుంచి ప్రజలు అనారోగ్య పాలు కాకుండా ముందు చర్యలు చేపట్టాలని కోరారు.

సెల్ ఫోన్ నష్టాలపై అవగాహన కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేటి కాలంలో సెల్ ఫోన్ వాడకం విపరీతంగా పెరిగిపోయిందని, చిన్న పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని మానవ హక్కుల వేదిక అధ్యక్షుడు అతిష్ కుమార్ అన్నారు. పాఠశాలల్లో దీనిపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, చైతన్యపర్చాలని కోరారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీతను ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సెల్ఫోన్ వాడకంతో జరిగే నష్టాలపై డెమో క్లాసులు ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

రెండో రోజు జూడాల సమ్మె

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విధులు బహిష్కరించి, రిమ్స్ జూనియర్ డాక్టర్‌లు నిరవధిక సమ్మె చేపడుతున్నారు. జిల్లాకేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎదుట సమ్మె చేపట్టగా మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ, డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జూడాల అధ్యక్షుడు సందీప్‌చారి మాట్లాడుతూ స్టైఫండ్ పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాలలో జూనియర్ డాక్టర్లకు వసతులు లేవన్నారు. సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌లకు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. వివిధ ప్రభుత్వ ఆస్పత్రులలో భద్రతా సమస్యలు ఉన్నాయని తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె చేపడుతామని స్పష్టం చేశారు. సమ్మెలో జూనియర్ డాక్టర్‌లు ఉన్నారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ

మూడు రోజుల్లో 248 మంది వెరిఫికేషన్ పూర్తి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాలిసెట్ మొదటి విడత సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ మూడవ రోజు మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సంజయ్ గాంధీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియకు అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకున్న విధంగా కళాశాలకు చేరుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించారు. ఆదివారం వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభమై మూడు రోజులపాటు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు జరిగింది. ఈ సందర్భంగా సిబ్బంది అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించి తగిన సలహా సూచనలు చేశారు. అనంతరం తదుపరి ప్రక్రియ గురించి విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. మంగళవారం 47మంది అభ్యర్థులు స్లాట్ బుక్ చేసుకోగా 47మంది అభ్యర్థులు హాజరై సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసుకున్నట్లు పాలిసెట్ కోఆర్డినేటర్ భరద్వాజ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగిన కౌన్సెలింగ్‌లో మొత్తం 248 మంది విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందని తెలిపారు.

షెడ్యూల్ వివరాలు

మొదటి విడతలో భాగంగా పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన వారు ఈనెల 27లోపు వెబ్ అప్షన్లు పెట్టుకొని కళాశాలలను ఎంపిక చేసుకోవాలని కోఆర్డినేటర్ తెలిపారు. కళాశాలలు ఎంపిక చేసిన వారికి జూన్ 30న సీట్ల కేటాయింపు ఉంటుందని వెల్లడించారు. జూన్ 30 నుండి జులై 4 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. జులై 7నుండి రెండవ విడత ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు.

ప్రయివేట్ ఆస్పత్రులను నియంత్రించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



నిబంధనలు పాటించని ప్రయివేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని నియంత్రించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంకటేష్ ధోత్రేని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 51 ప్రయివేట్ ఆస్పత్రులున్నాయని, కనీస నిబంధనలు పాటించడం లేదని ఆరోపించారు. ఆస్పత్రులకు బయట ఉన్న బోర్డులో ఒక పేరు ఉంటే వైద్యుడు మరొకరు ఉంటున్నారన్నారు. జిల్లా వైద్యాధికారులు కనీసం ఇటువంటి విషయాలు కూడా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం జనకాపూర్‌కు చెందిన చిన్నారి మృతి చెందిందని, రెండు నెలల క్రితం కాగజ్‌నగర్ కేంద్రాల్లోని ప్రయివేట్ ఆస్పత్రిలో గర్భిణి మృతి చెందిందని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన వైద్యాధికారులు కనీసం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రయివేట్ ఆస్పత్రిలపై వెంటనే ప్రత్యేక కమిటీతో తనిఖీ చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తిక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు నిఖిల్, జిల్లా సహాయ కార్యదర్శి వడ్లూరి శ్రీకాంత్, జిల్లా నాయకులు జాడి తిరుపతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



- వెనుక నుంచి లారీని ఢీకొట్టిన ప్రయివేట్ ట్రావెల్స్
- 30 మందికి గాయాలు
- కామారెడ్డి వద్ద ఘటన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల ఓ ప్రయివేటు ట్రావెల్స్ రోడ్డు ప్రమాదానికి గురైన ఘటన మరువకముందే తాజాగా మరో ప్రయివేటు ట్రావెల్స్ రోడ్డు ప్రమాదానికి గురైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ ప్రయివేటు ట్రావెల్ బస్సు మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదానికి గురైంది. కామారెడ్డి మండలం క్యాసంపల్లి జాతీయ రహదారిపై ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న డైమండ్ ట్రావెల్స్ బస్సు ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఒకరు మృతి చెందాడు. కాగా ఇందులో ప్రయాణిస్తున్న 30 మంది ప్రయాణికులకు గాయాలు కాగా, మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మత్తు పదార్థాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాదకద్రవ్యాల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని వాటి వాడకంతో విలువైన భవిష్యత్తును కోల్పోతోందని జిల్లా న్యాయ సేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.యువరాజ అన్నారు. ప్రపంచ మాదకద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయ సేవ అధికారిక సంస్థ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపన్యాస, చిత్రలేఖన, డిబేట్, డ్రామా పోటీల ముగింపు కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటై సంస్కృతి, సాంప్రదాయాన్ని విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సత్ప్రవర్తనను వదిలి, మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సుభాష్ బాబు, న్యాయనిర్ణేతలు ధర్మపురి వెంకటేశ్వర్లు, రాజ్ కమలాకర్ రెడ్డి, గుర్రాల వెంకటేశ్వర్లు, కిల్లీ వెంకట్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'నిస్వార్థంగా సేవలందించారు'



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేస్తున్న దాసరి ఆశమ్మ, గణపతి పదవీ విరమణ పొందారు. మంగళవారం సమగ్రశిక్ష అభియాన్ కార్యాలయంలో పదవీ విరమణ సభను ఏర్పాటు చేసి వారిని కార్యాలయ ఉద్యోగులో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా ఆదిలాబాద్ పట్టణ మండలంలో కాంట్రాక్ట్ మెసెంజర్‌గా విధులు నిర్వహించిన దాసరి ఆశమ్మ గణపతి పదవీ విరమణ పొందారు. ప్రభుత్వ ఆదేశానుసారం 61 సంవత్సరాలు నిండిన ఉద్యోగులను ఎటువంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ లేకుండా చేసిన సర్వీసుకు, ఎటువంటి గుర్తింపు లేకుండా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులను పదవీ విరమణ ఇచ్చారని అన్నారు. ప్రభుత్వం వారిని గుర్తించకున్నా, ఆదుకోకున్న మండలంలోని సీఆర్పి, ఎంఐఎస్, సీసీఓ, ఐఆర్పి ఉద్యోగులు తలా కొంచెం పోగుచేసి విరమణ పొందిన ఆశమ్మకు రూ.10వేల నగదు అందజేశారు. అదేవిధంగా మండల ఎంఈఓ జయశీల, యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగన్న, బంగారుగూడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ఉపాధ్యాయులు నోటంకి సత్యనారాయణ, రవీందర్‌రెడ్డి పదవీ విరమణ పొందిన దాసరి ఆశమ్మ నగదు సాయం అందజేశారు.

ఐటీడీఏ ఉపాధ్యాయుల బదిలీ షెడ్యూల్ ప్రకటించాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట్ రామ్



నవతెలంగాణ-ఉట్నూర్

గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూలు వెంటనే ప్రకటించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాదవ్ వెంకట్‌రామ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న గిరిజన పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు షెడ్యూలను వెంటనే విడుదల చేసి మాన్యువల్, ఆఫ్‌లైన్‌లో ఉపాధ్యాయులకు భరోసా కల్పించాలన్నారు. ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్ వన్ ఉపాధ్యాయులను జోనల్ పోస్టుల ప్రమోషన్‌ల భర్తీ ప్రక్రియ కూడా ఇందులో భాగంగా చేపట్టాలని గిరిజన బాలికల పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులను వార్డెన్‌లుగా నియమించాలని, ప్రతి టీడబ్ల్యూపీఎస్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేష్ నాయక్, ఉపాధ్యాయులు మోహన్ నాయక్ పాల్గొన్నారు.

పల్లెపల్లెలో డీవైఎఫ్ఐ యువజన సర్వే



నవతెలంగాణ-రెబ్బెన

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డివైఎఫ్ఐ గ్రామగ్రామాన యూత్ సర్వేలో భాగంగా మండలం రాంపూర్ గ్రామంలో పర్యటించారు. సమస్యలను డివైఎఫ్ఐ బృందానికి తెలియజేయడం జరిగిందన్నారు. మండల కేంద్రానికి వెళ్లాలంటే రహదారి దారుణంగా ఉందని, తాగునీటి సమస్య, రాంపూర్ గ్రామానికి దగ్గరలో డాంబర్ ప్లాంట్ నిర్మించారని దాన్ని తొలగించాలన్నారు. గత సంవత్సరంలో రూ.కోటి 40 లక్షలతో నిధులు మంజూరైనప్పటికీ నత్త నడకన రోడ్డు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు చల్మారి కృష్ణ మండల సహాయ కార్యదర్శి చాపిడి తిరుపతి, గ్రామ యువకులు రవితేజ, రాహుల్, అశోక్ పాల్గొన్నారు

వాంకిడి : మండలంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగిందని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ తెలిపారు. మండలంలోని నవెగూడ, కేజీ గూడా, తెదాపూర్ గ్రామాల్లో సర్వేలు నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. నవెగూడ గ్రామంలో అనేక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వర్షాకాలం వచ్చిందంటే ఆ గ్రామానికి రాకపోకలు ఉండవన్నారు. గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రె ఉందని దానిపై వంతెన లేక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అన్ని సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు దుర్గం నిఖిల్, వడ్లూరి శ్రీకాంత్, జాడి తిరుపతి, యువకులు పాల్గొన్నారు.

భరోసా సెంటర్‌తో సత్వర న్యాయం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సమాజంలోని వివిధ సంఘటనల్లో బాధితులుగా ఉన్న మహిళలకు భరోసా సెంటర్ ద్వారా సత్వర న్యాయం అందించాలని, అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. భరోసా సెంటర్ సిబ్బంది నూతనంగా జిల్లాకు వచ్చిన ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై జరిగే లైంగిక దాడులను నివారించడానికి నిరంతరం కృషి చేయాలని తెలిపారు. ఇదే సందర్భంలో బాధితులు ఎవరైనా ఉంటే వారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. భరోసా సెంటర్ ద్వారా సత్వర న్యాయంతో పాటు కౌన్సిలింగ్, వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. సిబ్బంది కూడా నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ రమేష్, ఎస్సై ఓబులమ్మ, లీగల్ అడ్వైజర్ శైలజ, రిసెప్షనిస్టు రజిత, ఏఎస్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించడంతో పాటు అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్ స్టేషన్‌ల అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లకు వచ్చే ఫిర్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండడంతో పాటు త్వరగా పరిష్కరించాలన్నారు. బాధితులు ఇచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు వాటి పరిష్కార విధానాన్ని కూడా నమోదు చేయాలన్నారు. సత్వర న్యాయం చేసినప్పుడే ప్రత్యేక గుర్తింపు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాపై నేరుగా అభిప్రాయాల సేకరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వం రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో తీసుకువచ్చిన రైతు భరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతు వేదికలో జిల్లా వ్యవసాయ అధికారులతో పాటు రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా రానున్న రైతు భరోసాలో ఎటువంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకొని రైతు భరోసా అమలు చేయాలనే విషయాన్ని మంత్రి రైతుల వద్ద నుండి అభిప్రాయాలను సేకరించారు. ఎక్కువ మంది రైతులు 10 ఎకరాల వరకు రైతు భరోసా అమలు చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆర్. శ్రీనివాస్ రావ్, వ్యవసాయసహాయ సంచాలకులు మిలింద్ కుమార్, బి.ప్రసాద్, మండల వ్యవసాయ అధికారులు ఖాదర్ హుస్సేన్, తిరుమలేశ్వర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

29న జిల్లా పరిషత్ ప్రత్యేక సమావేశం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో ఈనెల 29న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సభ్యులు, జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.